సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 7 । నవంబర్ । 2024



సోమశిలలో 69.656 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారం నాటికి 69.656 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 7,081 క్యూసెక్కుల వరద వస్తోంది. డెల్టాకు 2,300, ఉత్తర కాలువకు 700, కండలేరుకు 10 వేలు, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.80,730
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,335
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,555
నవర (8 గ్రాములు)	రూ.60,440

గరిష్టం/కనిష్టం
31.1 /24.5

వాతావరణం

జిల్లాలో గురువారం ఆకాశం మేఘావృతంగా వర్షం కురిసే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులతో కూడిన వాతావరణం ఉంటుంది. బుధవారం గాలిలో తేమ 79 శాతం ఉంది.

న్యూస్‌రీల్

18 వరకు 'పది' ఫీజు గడువు పొడిగింపు

నెల్లూరు (టౌన్): పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు గడువును ఈ నెల 18వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈఓ ఆర్.బాలాజీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుంతో 25వ తేదీ వరకు, రూ.200 అపరాధ రుసుంతో వచ్చే నెల 3వ తేదీ వరకు, రూ.500 అపరాధ రుసుంతో వచ్చే నెల 10వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. రెగ్యులర్ విద్యార్థులు రూ.125, సప్లిమెంటరీ విద్యార్థులు 3 సబ్జెక్ట్‌ల వరకు రూ.110, ఆపైన రూ.125 చెల్లించాలన్నారు. ఒకేషనల్ విద్యార్థులు అదనంగా రూ.60 చెల్లించాలన్నారు. మైగ్రేషన్ సర్టిఫికెట్ కోసం రూ.80 చెల్లించాలని చెప్పారు.

బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు (క్రైమ్): బాలికపై లైంగిక దాడి చేసిన ఘటనలో నిందితుడు ఆటోడ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. భగత్‌సింగ్ కాలనీ టిడ్కో ఇళ్లలో నివాసం ఉంటున్న ఆరో తరగతి చదువుతోన్న ఓ బాలికపై అదే ఇళ్లలో నివాసం ఉంటున్న ఆటోడ్రైవర్ అలీ పలుమార్లు లైంగిక దాడి చేశాడు. బాధిత తల్లి ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు ఇటీవల పోక్సో కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టిన నగర డీఎస్పీ డి. శ్రీనివాసరెడ్డి పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం వెంకటేశ్వరపురం విజయ పాల డెయిరీ సమీపంలో నిందితుడు అలీని అరెస్ట్ చేశారు.

వైద్యశాఖలో డిప్యుటేషన్లపై విచారణ

నెల్లూరు (అర్బన్): జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో కొంత మందికి వేసిన డిప్యుటేషన్లపై ఫిర్యాదులందడంతో బుధవారం మెడికల్ ఆఫ్ డైరెక్టరేట్ నుంచి జేడీ కామేశ్వరప్రసాద్ నెల్లూరు వచ్చారు. డిప్యుటేషన్లపై విచారించారు. వైద్యశాఖలో అందుకు సంబంధించిన ఉత్తర్వులను పరిశీలించారు. మర్రిపాడు మండలం కృష్ణాపురం పీహెచ్‌సీకి డిప్యుటేషన్‌పై వచ్చిన ఒక డాక్టర్ ఉన్నతాధికారుల అనుమతి తీసుకోకుండా విధులకు డుమ్మా కొట్టి పీజీ కోర్సు చేసేందుకు వెళ్లాడు. ఈ విషయంపై కూడా విచారణ జరిపారు. ఈ వ్యవహారంలో కొన్ని అక్రమాలు వెలుగు చూశాయి. జేడీ కామేశ్వరప్రసాద్ ఇక్కడే ఉండి గురువారం కూడా సంతపేటలోని వైద్యశాఖ కార్యాలయంలో మరింత లోతుగా విచారించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నారు.

నలుగురు విద్యార్థుల డిబార్

వెంకటాచలం: వీఎస్‌యూ అనుబంధ కళాశాలల్లో బుధవారం నిర్వహించిన డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షల్లో నలుగురు విద్యార్థులు డిబార్ అయ్యారని వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. గూడూరులోని డీఆర్‌డబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ముగ్గురు, పొదలకూరులోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థి డిబార్ అయ్యారని తెలిపారు.

ఇంటి ముందే మందు



పచ్చని పల్లెలను మద్యం ముంచెత్తుతోంది. నిత్యావసరాలు దొరికే బడ్డీ కొట్లు లేని గ్రామాలైతే ఉన్నాయి కానీ.. మద్యం బెల్టు దుకాణం లేని పల్లె లేదంటే అతిశయోక్తి లేదు. అధికార బలంతో మద్యం దుకాణాలు దక్కించుకున్న టీడీపీ నేతలు బరితెగించారు. పల్లె, పట్టణం తేడా లేకుండా అడుగుకో బెల్టు దుకాణం ఏర్పాటు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బెల్టు షాపులకు వేలం పాట పెట్టి అప్పగించారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ షాపుల ఏర్పాటు, నిర్వహణ అంతా బహిరంగ రహస్యంగా జరుగుతోంది. బెల్టు దుకాణాల ఆదాయాన్ని తమ్ముళ్లు పంచుకుంటున్నారు.

అనంతసాగరం మండలంలోని పీకేపాడు, వెంగంపల్లి, ఆమనిచిరివెళ్ల గ్రామాల్లో బెల్టు దుకాణాలకు వేలం పాట నిర్వహించారు. ఆయా గ్రామాల్లో బెల్టు ద్వారా విక్రయాలు చేయాలంటే రూ.4 లక్షల వంతున ఆ గ్రామ టీడీపీ నేతలకు చెల్లించాలి. మద్యం షాపు యజమానులకు రూ.50 వేలు అడ్వాన్సు చెల్లిస్తే దుకాణానికి అవసరమైన మద్యం సరఫరా చేసేలా ఒప్పందం చేసుకున్నారు. బెల్టు దుకాణంలో బాటిల్‌పై ఎమ్మార్పీ కంటే అదనంగా రూ.20 పెంచి విక్రయం చేసుకోవచ్చు. నెలవారీ ఎక్సైజ్, పోలీస్ శాఖలకు మామూళ్లు అదనం.

ముత్తుకూరు మండలం నేలటూరు పంచాయతీ పట్టపుపాళెంలో మద్యం బెల్టు షాపునకు వేలం పాట నిర్వహించగా రూ.15 లక్షలు పలికింది. ఏడాది పాటు ఆ గ్రామంలో వారు బెల్టు దుకాణం నిర్వహించుకుంటారు. బెల్టులో ప్రతి బాటిల్‌పై ఎమ్మార్పీ కంటే అదనంగా రూ.30 పెంచి అమ్ముకునేలా ఒప్పందం చేసుకున్నారు.

కొడవలూరు మండలం రాజుపాళెంలో బెల్టు దుకాణాల ఏర్పాటు కోసం ప్రతి నెలా రూ.25 వేలు స్థానిక టీడీపీ నేతలకు చెల్లించాలి. ఎక్సైజ్, పోలీసులకు అదనంగా మరో రూ.10 వేలు చెల్లించాలి. నెలవారీగా రూ.35 వేలు చెల్లించి విక్రయాలు చేసుకోవచ్చు. బెల్టు దుకాణంలో ఎమ్మార్పీ కంటే రూ.30 అదనంగా పెంచి అమ్ముకోవచ్చు.

తమ్ముళ్ల ఆశీస్సులతో ఊరూరా బెల్టు షాపులు

- వేలంలో రూ.లక్షలు పలుకుతున్న వైనం
- జిల్లా వ్యాప్తంగా 2 వేలకుపైగా బెల్టు దుకాణాలు
- నెలవారీ మామూళ్లతో పట్టించుకోని ఎక్సైజ్, పోలీస్ శాఖలు
- బార్లను తలపిస్తున్న మద్యం దుకాణాలు





నెల్లూరు నగరంలోని వనంతోపు సెంటర్‌లో ఏర్పాటు చేసిన దుకాణం పక్కనే ఇలా బహిరంగంగా మద్యం తాగుతున్న మందుబాబులు



ఆత్మకూరులోని మెయిన్ బజారులో మద్యం దుకాణాలకు ఎదురుగా వెలసిన బెల్టు దుకాణం

సాక్షి ప్రతినిధి నెల్లూరు: జిల్లాలో ఊరూరా మద్యం పరవళ్లు తొక్కుతోంది. మద్యం మాఫియా వీధికోక బెల్ట్ షాపు ఏర్పాటు చేసి జనాన్ని మత్తులో ముంచెత్తిస్తున్నారు. నివాస గృహాలు, చిన్నచిన్న కిరాణా దుకాణాల్లో అడిగి బ్రాండ్ మద్యం దొరుకుతోంది. మద్యంషాపులు, బార్లలో నిర్దిష్ట సమయం ప్రకారం మద్యం దొరికితే బెల్టు షాపుల్లో 24 గంటలు అందుబాటులో లభిస్తోంది. ఇప్పటికే టీడీపీ మద్యం మాఫియా షాపులను సుప్రీం కోర్టు నిబంధనలకు విరుద్ధంగా జనావాసాలు, గుడి, బడి, మసీదు, చర్చిల పక్కనే ఏర్పాటు చేశారు. ఈ వ్యాపారాన్ని మరింతగా విస్తరించేందుకు బెల్టుషాపులను ఏర్పాటు చేశారు. జిల్లాలో అధికారికంగా 182 మద్యం దుకాణాలు ఉంటే.. వీటికి అనుబంధంగా 15 నుంచి 20 బెల్టు దుకాణాలు ఏర్పాటు చేయడం చేయడం గమనార్హం. జిల్లాలో మొత్తం 720 పంచాయతీలు ఉండగా దాదాపు 2,500 వరకు గ్రామాలు ఉన్నాయి. ఇప్పటికే దాదాపు 2 వేల బెల్టు షాపులు ఉన్నట్లు తెలుస్తోంది. లాటరీ ఫీజు, లైసెన్సు ఫీజు, షాపు అద్దె, సిబ్బంది వేతనాల రూపంలో అయ్యే ఖర్చును రాబట్టేందుకు బెల్టు షాపులను వ్యాపారులు ఆదాయ వనరులుగా మలుచుకున్నారు. గతంలో బెల్టు షాపుల్లో కేవలం ఛీప్ లిక్కర్ మాత్రమే అందుబాటులో ఉండేది. ప్రస్తుతం అన్నీ రకాల బ్రాండ్లు, బీర్లూ అందుబాటులో ఉన్నాయి. పేరుకే బెల్టు షాపులు వాస్తవానికి మినీ మద్యం షాపులను తలపిస్తున్నాయి. బెల్టులో క్వార్టర్, బీరుపై అదనంగా రూ.50 వరకు మందుబాబుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు.

అక్రమంగా సిట్టింగ్‌లు ఏర్పాటు

మద్యం రిటైల్ దుకాణాలు బార్లా తెరిచారు. నూతన మద్యం పాలసీ నిబంధనల మేరకు సిట్టింగ్ రూమ్‌లకు అనుమతులు లేవు. దుకాణంలో మద్యం కొనుగోలు చేసి తమ వెంట తీసుకెళ్లాలే తప్ప అక్కడ తాగాడానికి వీల్లేదు. అయితే వ్యాపారం సాగదని భావించిన మద్యం మాఫియా నిబంధనలకు నీళ్లు వదిలేసి కూల్ డ్రింక్ షాపుల ముసుగులా దుకాణాల పక్కనే సిట్టింగ్ రూమ్‌లు ఏర్పాట చేసి మందుబాబులతో మద్య సేవనం చేయిస్తున్నారు. కూల్ డ్రింక్స్ షాపు ఏర్పాటుకు రూ.5 లక్షల వంతున స్థానిక ఎమ్మెల్యే అనుచరులకు ఇవ్వాల్సి ఉంది. ఇది కాకుండా నెలవారీగా రూ.50 వేలు చెల్లింపులు చేయాలి. కొన్నిచోట్ల దుకాణాల బయటే మద్య సేవనం సాగుతోంది. జిల్లా కేంద్రంలో 30 మద్యం దుకాణాలుండగా ప్రతి దుకాణానికి పక్కనే కూల్ డ్రింక్ షాపు ముసుగులో సిట్టింగ్ రూమ్‌లు నడుస్తున్నాయి. జిల్లా కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే మారుమూల ప్రాంతాల్లో ఎలా ఉంటుందో ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. బెల్టు షాపుల్లోనూ సిట్టింగ్ ఏర్పాట్లు చేస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఆహార పదార్థాలు తయారు చేస్తూ మందుబాబులకు అందజేస్తున్నారు. బెల్టు షాపుల మధ్య పోటీ పెరగడంతో కస్టమర్లను ఆకర్షించేందుకు ఇళ్లలోనే ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. బార్ అండ్ రెస్టారెంట్ల మాదిరిగా బెల్టు షాపుల్లో చికెన్, మటన్, గుడ్లు, ఆమ్లెట్, తదితర ఆహార పదార్థాలను వండి అందజేస్తున్నారు.

మామూళ్లతో గంతలు

నిబంధనలు పక్కాగా అమలయ్యేలా చూడడంతో పాటుగా ఉల్లంఘనులపై చర్యలు తీసుకోవాల్సిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. వ్యాపారులు యథేచ్ఛగా ఉల్లంఘనలకు పాల్పడుతున్నా కనీస స్పందన లేకపోవడం చూస్తే ఆశాఖ అసలు ఉందా అనే సందేహం వస్తోంది. వ్యాపారులు మాత్రం ఎక్సైజ్ శాఖ అధికారులతో ముందస్తు ఒప్పందాలు చేసుకున్నామని, ఇక తమను ఆపేదెవరంటూ బహిరంగంగానే అక్రమ దందా చేస్తున్నారు. ఇక పోలీసులు అదే బాట పట్టారు. ప్రతి నెలా మద్యం వ్యాపారుల నుంచే కాకుండా బెల్టు దుకాణాల నుంచి నెలవారీగా మామూళ్లు పెట్టుకుని పట్టించుకోవడం మానేశారు.

రూ.లక్ష నుంచి రూ.15 లక్షలకు బెల్టు వేలం



గతంలో బెల్టు దుకాణం నిర్వహించడం నేరమైతే.. ఇప్పుడు అధికారమైపోయింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక్కొక్క దుకాణానికి రూ.లక్ష నుంచి రూ.15 లక్షల వరకు బెల్టు షాపులు పోటీపడి వేలంలో దక్కించుకున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పట్టణాల పరిధిలో కలిపి రెండు వేలకుపైగా బెల్టు దుకాణాలు ఏర్పాటు చేసి మద్యం తాపించేలా చేస్తున్నారు. ఇళ్ల ముందే మద్యం దొరుకుతుండడంతో మందు బాబులు తమ రెక్కల కష్టాన్ని మద్యానికి తగలేసి పూటుగా తాగేస్తున్నారు.



మాజీ సీఎం జగన్‌తో కాకాణి భేటీ

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో రాజకీయ పరిణామాలను జగన్‌కు వివరించారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జగన్ సూచించారు. సోషల్ మీడియా కార్యకర్తల అరెస్ట్ విషయంలో న్యాయపోరాటానికి సన్నద్ధం కావాలని, వారికి అండగా నిలవాలని సూచించారు. కార్యకర్తలకు పార్టీ పరంగా అండగా నిలవాలన్నారు. - నెల్లూరు (బారకాసు)

ఉచిత ఇసుకకు మార్గదర్శకాలు

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో ఉచిత ఇసుకకు సంబంధించి మార్గదర్శకాలు జారీ చేస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు వసూళ్లు చేస్తున్న వివిధ రకాల రుసుములను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఇసుక అవసరమైన వారు ఇసుక పోర్టల్ (www. sand. ap. govt. in)లో రిజిస్ట్రేషన్ చేసుకుని నిర్మాణ వివరాలు పొందుపరచి ఉచితంగా పొందవచ్చన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఇసుక తరలించే వారు గ్రామస్తుల అవసరాల కోసమే వినియోగించుకోవాలన్నారు. ఎటువంటి యంత్రాలను వినియోగించకూడదని సూచించారు. సాధారణంగా ఇసుక తరలించేవారు స్టాక్ పాయింట్ నుంచి లేక రీచ్‌ల నుంచి నిర్ణయించిన ధరలకు మాత్రమే ఇసుక తరలించుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ఉచిత ఇసుక సరఫరా అని వాహనాలకు బ్యానర్ పెట్టాలని, జీపీఎస్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

త్వరలో 330 గ్రామాల్లో రీసర్వే

- రేషనలైజేషన్‌లో కొత్తగా 179 రేషన్ షాపులు
- జాయింట్ కలెక్టర్ కార్తీక్



మీడియాతో మాట్లాడుతున్న జేసీ కార్తీక్

నెల్లూరు (దర్గామిట్ట): జిల్లాలో రీసర్వే జరగని 330 రెవెన్యూ గ్రామాల్లో త్వరలో ఆ ప్రక్రియ చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు భూముల రీసర్వే ప్రక్రియ చేపడుతున్నట్లు వివరించారు. ఇప్పటి వరకు జిల్లాలో 320 గ్రామాల్లో రీసర్వే పూర్తయినా.. ఆయా గ్రామాల్లో భూ సమస్యలపై ఇప్పటి వరకు 5,300 అర్జీలు వచ్చాయన్నారు. వాటిని పరిష్కరించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. రీసర్వేలో వచ్చే భూ సమస్యలను 150 రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పెండింగ్ ఫైళ్ల పరిష్కారం

కలెక్టరేట్‌లో అడంగళ్ కరెక్షన్, నోషనల్ ఖాతాలు, 22ఏ చుక్కల భూములు తదితరాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను త్వరలో క్లియర్ చేసేలా చర్యలు తీసుకుంటామని జేసీ చెప్పారు. కలెక్టరేట్‌లో ఎన్ని ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయో లెక్క తేల్చమని సంబంధిత సిబ్బందని ఆదేశించామని, కలెక్టర్ పరిధిలో ఉన్న ఫైల్స్ 48 గంటలు, తన పరిధిలో ఉన్న ఫైల్స్ 24 గంటల సమయంలో క్లియర్ చేసేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు.

మరింత పక్కాగా పీజీఆర్ఎస్

జిల్లాలో కలెక్టరేట్ కేంద్రంగా ప్రతి సోమవారం జరుగుతున్న ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మరింత పక్కాగా నిర్వహించనున్నట్లు జేసీ తెలిపారు. నిర్దేశించిన సమయానికి ఆయా అర్జీలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని, పునరావృతమయ్యే అర్జీలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా రీఓపెన్ అయిన కలిగిరి మండలానికి సంబంధించిన ఒక అర్జీకి సంబంధించి అర్జీదారుడిని పిలిపించి తానే మాట్లాడానన్నారు.

కొత్తగా 175 రేషన్ షాపులు

ఇక ప్రజాపంపిణీ వ్యవస్థకు సంబంధించి జిల్లాకు కొత్తగా 179 రేషన్ దుకాణాలు మంజూరు కానున్నట్లు జేసీ కార్తీక్ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 1,513 రేషన్ షాపులు ఉన్నాయని, రేషనలైజేషన్‌లో భాగంగా మరో 179 రేషన్‌షాపులు ఏర్పాటు కానున్నాయన్నారు. పట్టణ ప్రాంతాల్లో 500 పైగా కార్డులు ఉంటే అక్కడ కొత్తగా మరో రేషన్ షాపు, గ్రామీణ ప్రాంతాల్లో 800 కార్డులకు పైగా ఉంటే అక్కడ మరో కొత్త రేషన్ షాపు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

రేషన్ బియ్యానికి రెక్కలు
ఆంధ్రా టు ఆఫ్రికా

- ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో సేకరణ
- కృష్ణపట్నం, ఎన్నూరు పోర్టుల ద్వారా విదేశాలకు ఎగుమతి
- జాతీయ రహదారిపై యథేచ్ఛగా అక్రమ రవాణా
- కూటమి నేతల కనుసన్నల్లోనే జోరుగా సాగుతున్న వైనం
- స్టాక్ పాయింట్ల నుంచే నేరుగా తరలింపు
- గత ప్రభుత్వంలో అక్రమ వ్యాపారానికి కళ్లెం



కావలి పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం లారీలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. నేరుగా స్టాక్‌పాయింట్ల నుంచే నాణ్యమైన బియ్యాన్ని సేకరిస్తున్నారు. వీరికి అనుకూలంగా ఉన్న కొన్ని రైస్‌మిల్లుల్లో బియ్యాన్ని పాలిష్ పట్టి నాణ్యత పెంచుతున్నారు. లారీల్లోకి లోడ్ చేసి కృష్ణపట్నం, చెన్నై పోర్టులకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి ఆఫ్రికా దేశాలకు ఎగుమతి జరుగుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రేషన్ బియ్యం రీసైక్లింగ్, అక్రమ వ్యాపారానికి కళ్లెం పడింది. తాజాగా టీడీపీ అధికారంలోకి రావడంతో మళ్లీ రేషన్ బియ్యం అక్రమాలు ప్రారంభమయ్యాయి. అడ్డుకోవాల్సిన సివిల్ సప్లయిస్ శాఖ అధికారులే అక్రమాలకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



కావలి: దక్షిణ కోస్తా జిల్లాల నుంచి రేషన్ బియ్యం సముద్ర మార్గాల ద్వారా ఆఫ్రికా దేశాలకు తరలిపోతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నేతలు ఏళ్ల తరబడి ఉన్న డీలర్లను తొలగించి తమకు అనుకూలమైన వారికి అప్పగించారు. అప్పటి నుంచి విచ్చలవిడిగా రేషన్ బియ్యం అక్రమ వ్యాపారానికి తెర తీశారు. గత ప్రభుత్వంలో నాణ్యమైన రేషన్ బియ్యం సరఫరా చేయడంతో అక్రమ రవాణాకు కళ్లెం పడింది. గత కొద్ది నెలలుగా ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి భారీ స్థాయిలో రేషన్ బియ్యం సేకరించి, స్థానికంగా ఉండే రైస్‌మిల్లుల్లో పాలిష్ పట్టించి జిల్లాలోని కృష్ణపట్నం, చెన్నై పోర్టుల ద్వారా విదేశాలకు ఎగుమతులు చేస్తున్నారు. రెండు పోర్టుల నుంచి బియ్యం విదేశాలకు ఎగుమతి జరుగుతుందంటే.. ఏ స్థాయిలో రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు.

లబ్ధిదారుల నుంచి రూ.10కు కొని..

పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం సబ్సిడీతో సరఫరా చేసే బియ్యాన్ని అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. కూటమి నేతలే మాఫియాగా ఏర్పడి పెద్ద ఎత్తున రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. విచ్చలవిడిగా జరిగే రేషన్ బియ్యం దందాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఈ మాఫియా చక్రంలో మూడు దశలు ఉంటాయి. ప్రజల నుంచి కిలో బియ్యాన్ని లోకల్ మాఫియా వ్యక్తులు రూ.10కు కొనుగోలు చేసి.. అంతర్ జిల్లా మాఫియాకు రూ.20కు అమ్ముకుంటున్నారు. వీరు అంతర్ రాష్ట్ర మాఫియాకు రూ.40కు విక్రయిస్తున్నారు. వీరు కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని కృష్ణపట్నం, చెన్నై పోర్టులకు చేర్చి అక్కడ ఇనుంచి ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేస్తుంటారు.

చేతులెత్తేసిన సివిల్ సప్లయిస్ శాఖ

రేషన్ బియ్యం అక్రమ వ్యాపారాన్ని అరికట్టాల్సిన సివిల్ సప్లయిస్ శాఖ చేతులెత్తేసింది. కూటమి నేతలే రేషన్‌బియ్యం అక్రమ వ్యాపారం చేస్తుండడంతో అడ్డుకోవాల్సిన సివిల్ సప్లయిస్ శాఖ అధికారులే అక్రమాలకు అండగా నిలుస్తున్నారే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజలే అడ్డుకుంటే తప్ప ఏమి చేయలేమని ఆశాఖాధికారులు చెబుతుండడం చూస్తే.. క్షేత్రస్థాయిలో పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వినుకొండ, చిలకలూరిపేట, నరసారావుపేట, బాపట్ల, మాచర్ల, గురజాల ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పర్చూరు, చీరాల, పర్చూరు, అద్దంకి, కందుకూరు, ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి, ఆత్మకూరు, సూళ్లురుపేట, నాయుడుపేట, గూడూరు, వెంకటగిరి తదితర ప్రాంతాల నుంచి చెన్నై పోర్టుకు రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. లబ్ధిదారుల నుంచి రేషన్ డీలర్ల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి గోదాముల్లో నిల్వ చేస్తున్నారు. రాత్రి వేళ అక్రమ రవాణా చేస్తున్నారు. పలుమార్లు పట్టుబడినా రేషన్ మాఫియా దందాను ఆపడం లేదు. అక్రమార్కులు రేషన్ బియ్యాన్ని కృష్ణపట్నం, చెన్నై పోర్టులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

ప్రజల్లో చైతన్యం రావాలి

ప్రభుత్వం పేదలకు కడుపు నింపడానికి ఉచితంగా ఇస్తున్న బియ్యం అక్రమ వ్యాపారం చేయడం బాధాకరం. రేషన్‌కార్డుదారుడైన వేలి ముద్ర వేస్తే కానీ డీలర్ బియ్యం ఇవ్వరు. అందువల్ల పేద ప్రజల్లో చైతన్యం రావాలి. ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న బియ్యంను అక్రమంగా దళారులకు చేరకుండా ఉండాలంటే లబ్ధిదారులైన ప్రజల ఆలోచనా విధానంలో మార్పు రావాలి. జిల్లాలో ఆరుగురు పౌర సరఫరాల శాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. మా దృష్టికి వచ్చిన అక్రమాలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నాం. ఏడాది కాలంలో జిల్లాలో అక్రమంగా తరలిస్తున్న120 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నాం.
– డి.వెంకటరమణ, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి, నెల్లూరు

బియ్యం సేకరణ ఇలా..

రేషన్ బియ్యం అక్రమ వ్యాపారాన్ని సాగిస్తున్న మాఫియా స్థానికంగా దళారులను ఏర్పాటు చేసుకుని తక్కువ ధరకు సేకరించి ఒక చోట నిల్వ చేసుకుంటున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా బైక్‌లపై తరలిస్తున్నారు. ఒక వ్యక్తి ద్విచక్ర వాహనంపై రోజుకు 20 నుంచి 30 క్వింటాళ్ల బియ్యం ఒక చోట చేర్చుతాడు. అక్కడి నుంచి మినీ వాహనాలు, ఆటోల్లో గోదాములకు చేర్చుతుంటారు. అక్కడి నుంచి లారీల్లో పోర్టు ప్రాంతాలకు తరలిస్తున్నారు. కావలి సమీపంలో ఒకే సమయంలో రెండు లారీల్లో రవాణా చేస్తున్న 55 టన్నుల రేషన్ బియ్యం పట్టుబడిదంటే ఏ స్థాయిలో ఈ అక్రమ వ్యాపారం జరుగుతుందో అర్థమవుతోంది. అడపాదడపా పట్టుబడడం మినహా రేషన్ దందా నిర్విఘ్నంగా కొనసాగుతుందని పట్టుబడి సందర్భాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ అక్రమ దందాకు అడ్డుకట్ట వేయడానికి రేషన్ బియ్యం తరలింపులో దొరికిన పాత్రధారులపై '6ఏ' కేసులు నమోదు చేసి చేతులు దులుపుకోవడంతో మాఫియాకు లెక్కలేకుండా పోతోంది.

55 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

కావలి: కోల్‌కత్తా– చెన్నై రహదారిపై కావలి సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద మంగళవారం అర్ధరాత్రి రెండు లారీల్లో తరలిస్తున్న 55 టన్నుల రేషన్ బియాన్ని పోలీసులు పట్టుకున్నారు. కావలి రూరల్ ఎస్‌ఐలు బాజీబాబు, బాలకృష్ణయ్య తమ సిబ్బందితో కలిసి టోల్‌ప్లాజా వద్ద వాహనాల సాధారణ తనిఖీ చేస్తుండగా, ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి రేషన్ షాపుల నుంచి సేకరించిన బియ్యాన్ని ఆఫ్రికా దేశాలకు రవాణా చేసేందుకు చెన్నై పోర్టుకు తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన లారీలను బియ్యం సహా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ బియ్యం ఎక్కడి నుంచి ఎక్కడికి ఎవరు రవాణా చేస్తున్నారో దర్యాప్తు చేస్తున్నారు. వీటిని సివిల్ సప్లయిస్ శాఖకు అప్పగించనున్నారు.

కేన్సర్.. చాలా డేంజర్

జిల్లాలో కేన్సర్ కేసులు పెరుగుతున్నాయి. మారుతున్న ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం, ధూమపానం, పర్యావరణ కాలుష్యం కేన్సర్ బీజాన్ని నాటుతున్నాయి. పొగతాగే వారికి మాత్రమే కాకుండా, పొగ పీల్చే వారికీ లంగ్ కేన్సర్ సోకుతోంది. మరోవైపు జంక్‌పుడ్‌కు అలవాటు పడుతున్న వారు కూడా వ్యాధి బారిన పడుతున్నారు.

- జిల్లాలో పెరుగుతున్న రోగులు
- స్త్రీలల్లో రొమ్ము, గర్భాశయ కేన్సర్‌లే అధికం
- పురుషుల్లో నోటి, ఉదర, ఊపిరితిత్తులు, లివర్‌కు సంబంధించినవి ఎక్కువ
- జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవం నేడు



నెల్లూరు(అర్బన్): అత్యంత ప్రాణాంతక వ్యాధుల్లో కేన్సర్ ఒకటి. ఇది సోకిందని చాలామంది తెలుసుకునే సరికే మూడో దశ, నాలుగో దశలో ఉంటారు. చాలా మంది జీవితం ముగిసినట్టు భావిస్తున్నారు. వైద్యం తర్వాత కూడా ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. సాధారణ స్థితికి చేరుకోవడానికి రోగులకు ఎంతకాలం పడుతుందో.. ఎంతకాలం జీవిస్తారో చెప్పలేని పరిస్థితి. ఆ కుటుంబం ఆర్థికంగా చితికిపోతుంది. వ్యాధి ముదిరితే ప్రాణాలు పోయే అవకాశముంది. తొలిదశలో గుర్తిస్తే రోగిని ఆరోగ్యవంతుడిగా చేయొచ్చు. మేడం క్యూరీ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం నవంబర్ 7వ తేదీని జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవంగా భారత ప్రభుత్వం ప్రకటించింది. గురువారం వైద్య శాఖాధికారులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి

ప్రభుత్వ పెద్దాస్పత్రిలో కేన్సర్ విభాగం ప్రారంభించి రెండేళ్లవుతోంది. గత సంవత్సరం 3,500 మంది సేవలు పొందారు. నెలకు 1,100 మంది చొప్పున ఓపీలో వైద్యసేవలు పొందుతున్నారు. మెడికవర్ సూపర్ స్పెషాలిటీ కేన్సర్ ఆస్పత్రిలో 2023 నవంబర్ నుంచి 2024 అక్టోబర్ వరకు పరిశీలిస్తే సర్జికల్ ఆంకాలజీ కేసులు 754, రేడియోథెరపీ కేసులు 549, సర్వైకల్ కేసులు 328 ఉన్నారు. కీమోథెరపీ చికిత్స 5,952 మంది పొందారు. అలాగే నెల్లూరు అపోలో ఆస్పత్రిలో, చెన్నై, తిరుపతి, హైదరాబాద్‌లో చికిత్స చేయించుకున్న వారు వేలల్లోనే ఉన్నారు. సుమారు 30 వేల మంది వరకు జిల్లాలో కేన్సర్‌తో బాధపడుతున్నట్టు అంచనా.

ప్రధాన కారణాలు

అధిక మద్యపానం, ఖైనీ, జర్దా, మావా, గుట్కా, హాన్స్ లాంటి పొగాకు ఉత్పత్తులు అధికంగా వాడటం, ఆహారపు అలవాట్లు, కాలుష్యం, ఒత్తిడితో కూడిన జీవన విధానం, ఇన్ఫెక్షన్లతో ప్రధానంగా ఎక్కువగా కేన్సర్ కేసులు వెలుగు చూస్తున్నాయి. 100 మందికి వస్తే అందులో ఐదుగురిలో మాత్రమే జన్యుపరమైన కారణాలు, రోగనిరోధక వ్యవస్థ లోపాలు వచ్చే అవకాశం ఉంది. పొగాకు 14 రకాల కేన్సర్లకు కారణమవుతుంది. మద్యపానం వల్ల పేగు, స్వరపేటిక, నోరు, అన్నవాహిక, కాలేయం, ఉదర కేన్సర్లు వస్తున్నాయి. అధిక బరువు కారణంగా గర్భాశయం, పాంక్రియాటైటిస్ లాంటి 12 రకాల కేన్సర్లు వచ్చే ప్రమాదం ఉంది.

జిల్లాలో ఇలా..

రెడ్‌క్రాస్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో నమోదైన కేసులు	
2021లో	8,767 మంది
2022	10,919
2023	12,120
2024 (సెప్టెంబర్ వరకు)	9,895

చికిత్స చేయించుకున్నా..

జిల్లాలో స్త్రీలు అధికంగా రొమ్ము కేన్సర్ బారిన పడుతున్నారు. తర్వాత గర్భాశయ కేన్సర్‌తో బాధపడేవారు ఎక్కువగానే ఉన్నారు. అలాగే పురుషుల్లో నోరు, ఉదర, ఊపిరితిత్తులు, కాలేయం, హెడ్ అండ్ నెక్ కేన్సర్ ఉన్నవారే అధికం. వైద్యచికిత్స చేయించుకున్నప్పటికీ ప్రతి సంవత్సరం సుమారు 300 మంది వరకు మృత్యువాత పడుతున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు.



ముందుగా గుర్తిస్తే..



ఆకలి మందగించడం, బరువు తగ్గిపోవడం, నోటిలో ఏదైనా చిన్న పుండు ఉండి మానకపోవడం, మహిళల రొమ్ములో వాపు, నీరు కారడం, పొత్తికడుపు నొప్పి, నెలసరికి మధ్య రక్తస్రావం, మెనోపాజ్ తర్వాత రక్తస్రావం ఉంటే తక్షణమే డాక్టర్‌ను సంప్రదించాలి. కుటుంబంలో ఎవరికైనా కేన్సర్ ఉంటే 40 ఏళ్లలోపు నుంచే ఏడాదికి ఒక దఫా నైనా స్కానింగ్ లాంటి పరీక్షలు చేయించుకోవాలి. తొలిదశలో కేన్సర్‌ను గుర్తిస్తే వైద్యం ద్వారా పూర్తిగా నయం చేసుకోవచ్చు.

ఆహార అలవాట్లు మార్చుకోవాలి



ఆహార అలవాట్లు మార్చుకోవాలి. కల్తీలేని ఆహారం తినాలి. జంక్‌పుడ్స్, ధూమపానం, మద్యపానం, కాలుష్యం తదితర వాటికి దూరంగా ఉండాలి. ఒత్తిడి తగ్గించుకోవాలి. 30 ఏళ్లు దాటిన వారు సంవత్సరానికి ఒకసారైనా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి. కేన్సర్ లక్షణాలుంటే తొలిదశలోనే గుర్తించి వైద్యసేవలందిస్తాం. రోగి కోలుకుంటాడు.

– డాక్టర్ పద్మావతి, రేడియాలజీ ఆంకాలజిస్ట్, హెచ్ఓడీ, కేన్సర్ విభాగం, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

అవగాహన పెంచుకోవాలి



కేన్సర్ కేసులు వయసుతో సంబంధం లేకుండా పెరగడం బాధాకరం. అయినా భయపడకూడదు. 30 ఏళ్ల వయసు దాటిన స్త్రీలు రెండు, మూడేళ్లకొక దఫా మమోగ్రఫీ పరీక్ష చేయించుకోవాలి. 40 ఏళ్ల వయసు దాటిన వారు సంవత్సరానికి ఒక దఫా అల్ట్రాసౌండ్ స్కానింగ్, రక్తపరీక్షలు చేయించుకోవాలి. ఏమైనా తేడాలుంటే ముందస్తుగా గుర్తించవచ్చు. రెడ్‌క్రాస్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆధునిక రేడియాలజీ, కీమో, సర్జరీ విభాగాలున్నాయి. ఆరోగ్యశ్రీ ద్వారా రూపాయి ఖర్చు లేకుండా వైద్యసేవలందిస్తున్నాం.

– డాక్టర్ నాగేశ్వరరావు, మెడికల్ సూపరింటెండెంట్, రెడ్‌క్రాస్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్

అండర్ - 19 కబడ్డీ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

కావలి: పట్టణంలోని డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో 68వ అంతర్ జిల్లాల అండర్ – 19 కబడ్డీ పోటీలు మొదలయ్యాయి. ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా టీచర్స్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. కళాశాల చైర్మన్ దామిశెట్టి శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ క్రీడల్లో రాణించే వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు, ప్రిన్సిపల్ డాక్టర్ పీవీ రావు, డీవీఈఓ మధుబాబు, ఆర్ఐఓ శ్రీనివాసులు, స్టేట్ అబ్జర్వర్ గంగాధర్, నెల్లూరు జిల్లా అండర్ – 19 ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.శిరీష్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వై.సత్యనారాయణ, జేబీ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.



పాపిరెడ్డిపాళెం భూముల వద్ద ఉద్రిక్తత

- సీపీఎం నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- గుడిసెల తొలగింపు



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు తదితరులు

తోటపల్లిగూడూరు: మండలంలోని పాపిరెడ్డిపాళెంలో వివాదాస్పదంగా మారిన భూముల వద్ద బుధవారం సీపీఎం నాయకులు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మండలంలోని పాపిరెడ్డిపాళెంలో సర్వే నంబర్ – 497లో 10.08 ఎకరాల భూమి ఉంది. ఇందులో సగం తనదంటూ ఆ గ్రామానికి చెందిన మారంరెడ్డి పద్మావతమ్మ చెబుతోంది. అయితే ఇది మొత్తం ఇనాం భూమి అని సీపీఎం నాయకులు అంటున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య కొన్నేళ్లుగా వివాదం ఉంది. సీపీఎం భూ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్థానిక గ్రామాలకు చెందిన 350 మంది సదరు భూమిలో ఇటీవల గుడిసెలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ విషయాన్ని పద్మావతమ్మ కుటుంబసభ్యులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం ఇన్‌చార్జి తహసీల్దార్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు రెవెన్యూ సిబ్బంది కృష్ణపట్నం పోర్ట్ సీఐ రవినాయక్ సహకారంతో భారీ పోలీస్ బందోబస్తుతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్రమంగా వేసిన గుడిసెలను తొలగిస్తున్నామని, అందరూ వెళ్లిపోవాలని చెప్పారు. ఈ క్రమంలో సీపీఎం నాయకులు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. వివాదం ముదురుతున్న సమయంలో నాయకులైన వేగూరు వెంకయ్య, ఈపూరు లక్ష్మయ్య, మారుబోయిన రాజా, బండి శౌరి, పచ్చా మధును పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆ పార్టీ కార్యకర్తలను, గుడిసెలు వేసుకున్న వారిని పంపేశారు. తర్వాత జేసీబీలతో గుడిసెలను తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూములకు సంబంధించి రికార్డులను పరిశీలించాల్సి ఉందన్నారు. అవి ప్రభుత్వ భూములని తేలితే ఉన్నతాధికారుల అనుమతితో పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయిస్తామన్నారు.

దాడి కేసులో ఒకరికి జైలుశిక్ష

పొదలకూరు: దాడికి పాల్పడిన కేసులో నిందితులకు గూడూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టు జైలుశిక్ష, జరిమానా విధించారని పొదలకూరు ఎస్సై ఎస్‌కే హనీఫ్ బుధవారం వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. పట్టణంలోని వినాయకమాన్యంలో నివాసం ఉంటున్న కూనుపోగు తిరుపతమ్మ ఇంట్లో టీవీ చూస్తుండగా పాతకక్షలను మనసులో పెట్టుకుని కుమ్మరగుంట రవిచంద్ర, కుమ్మరగుంట ప్రభుదాస్, కుమ్మరగుంట రత్నయ్య, కుమ్మరగుంట పెంచలమ్మ, కుమ్మగుంట వెంకటమ్మ, మొద్దు మేరీలు దాడి చేసినట్టు 2018లో పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు అప్పట్లో ఎస్సై కేసు నమోదు చేసి విచారించారు. ఏ1 అయిన రవిచంద్రకు రెండు సంవత్సరాల జైలు, రూ.3,100 జరిమానా విధించారు. ప్రభుదాస్‌కు రూ.7 వేలు, రత్నయ్యకు రూ.2 వేలు, పెంచలమ్మకు రూ.2 వేలు, వెంకటమ్మకు రూ.2 వేలు, మేరీకు రూ.2 వేలు వంతున జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

అమ్మా సారీ.. నేను చదవలేకపోతున్నా

- ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య
- వీబీఆర్ స్కూల్లో విషాదం



పనత్‌రెడ్డి మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు



నెల్లూరు సిటీ: 'అమ్మా.. సారీ నేను చదవలేకపోతున్నాను.. నేను బతికినా ఒకటే.. చచ్చినా ఒకటే' అంటూ పదో తరగతి విద్యార్థి హాస్టల్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ముత్తుకూరు మండలం ఆర్ఆర్ కాలనీలో దువ్వూరు హరనాథ్‌రెడ్డి, అనిత దంపతులు నివాసం ఉంటున్నారు. వీరి జీవనాధారం వ్యవసాయం. ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు పనత్‌రెడ్డి (15) ధనలక్ష్మీపురంలోని వీబీఆర్ స్కూల్లో పదో తరగతి చదువుతున్నాడు. అతను చిన్నప్పటి నుంచే చదువుల్లో కొంత వెనుకబడ్డాడు. ఇంట్లో ఉంటే ఆటల్లో పడి పుస్తకాలపై శ్రద్ధ పెట్టే అవకాశం తక్కువగా ఉంటుందని, హాస్టల్లో చేర్పితే సహచర విద్యార్థులతో కలిసి మంచి మార్కులు సాధిస్తాడని తల్లిదండ్రులు భావించారు. దీంతో ఎనిమిదో తరగతిలోనే హాస్టల్లో చేర్పించారు. చదువు విషయంలో పనత్‌పై ఎక్కువ ఒత్తిడి చేయొద్దని, పాస్ మార్కులు వస్తే చాలని అక్కడి ఉపాధ్యాయులకు తల్లిదండ్రులు చెప్పారు. అయితే పనత్‌రెడ్డికి ఒక పక్క పాఠాలు అర్థం కాక, తల్లిదండ్రులకు చెబితే తిడతారని భయపడ్డాడు. ఎవరికి చెప్పుకోవాలో తెలియక తీవ్ర ఒత్తిడికి లోనవుతూనే చదువు కొనసాగించాడు. మంచి మార్కులు రావడం లేదన్న ఆందోళన అతన్ని వెంటాడుతూనే ఉంది. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం భోజనం చేశాక పనత్‌రెడ్డి నేరుగా హాస్టల్లోని తన గదికి వెళ్లాడు. నైలాన్ తాడుతో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఈ విషయాన్ని గమనించిన సహచర విద్యార్థులు పాఠశాల సిబ్బందికి సమాచారం అందించారు. వారు కిందకు దించి అతడిని చికిత్స నిమిత్తం నారాయణ హాస్పిటల్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే పనత్‌రెడ్డి మృతి చెందాడని నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని విగతజీవిగా పడి ఉన్న పనత్‌ను చూసి కన్నీటి పర్యంతమయ్యారు.

పాఠశాల ఎదుట ఆందోళన

పనత్‌రెడ్డి మృతిపై విద్యార్థి సంఘ నాయకులు పాఠశాల వద్ద ఆందోళన చేశారు. ఉపాధ్యాయుల ఒత్తిడితోనే అతను ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆరోపించారు. నెల్లూరు రూరల్ ఇన్‌స్పెక్టర్ వేణు ఘటనా స్థలానికి చేరుకుని వారికి సర్ది చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనధికార మద్యం విక్రయాలపై దాడులు

- 72 బాటిళ్ల సీజ్

నెల్లూరు(క్రైమ్): అనధికార మద్యం విక్రయాలపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి 72 క్వార్టర్ బాటిళ్లను సీజ్ చేశారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఏసీ పి.దయాసాగర్ పర్యవేక్షణలో ఎక్సైజ్ అధికారులు అనధికార మద్యం విక్రయాలపై దాడులు ముమ్మరం చేశారు. ఇప్పటి వరకు 25 కేసులు నమోదు చేశారు. బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ ఇన్‌స్పెక్టర్ వై.వెంకటేశ్వర్లు, పి.అనిత నేతృత్వంలో అధికారులు, సిబ్బంది దాడులు చేశారు. ధనలక్ష్మీపురం నుంచి వావిలేటివారిపాళెం వెళ్లే రహదారిలో అనధికార మద్యం విక్రయాలు చేస్తున్న కె.విజయకుమార్‌ను అరెస్ట్ చేసి 14 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు సమీపంలో హరికృష్ణను పట్టుకుని 30 బాటిళ్లు, అల్లూరు మండలం నార్త్‌మోపూరులో కామేశ్వరరావును పట్టుకుని 28 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనధికార మద్యం విక్రయాలకు పాల్పడినా, నిబంధనలు ఉల్లంఘించినా చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ ఎస్సై పూర్వకుమార్, కాలేషావలీ, సిబ్బంది పాల్గొన్నారు.



స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు

నెల్లూరు(దర్గామిట్ట): ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు డీఎస్సీ శిక్షణ కోసం ఈనెల 10వ తేదీన స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేయాలని డీఆర్వో జె.ఉదయ్‌భాస్కర్‌రావు ఆదేశించారు. నెల్లూరులోని కార్యాలయంలో బుధవారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఈనెల 10న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ఆన్‌లైన్ విధానంలో టెస్ట్ జరుగుతుందన్నారు. నెల్లూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, జెనెక్స్ విజన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ అండ్ టెక్నాలజీ, గంగవరంలోని గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, కావలిలోని పీబీఆర్ విశ్వోదయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మద్దూరుపాడులోని డీబీఎస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, కందుకూరులోని ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలల్లో నిర్వహిస్తామన్నారు. 499 మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. కేంద్రాల వద్ద నిరంతరం విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థులు ఉదయం 10 గంటలకు కేంద్రాలకు చేరుకోవాలన్నారు. స్మార్ట్‌వాచ్‌లు, మొబైల్ ఫోన్స్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. జ్ఞానభూమి వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు హెల్ప్‌డెస్క్ 95816 30003 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. సమావేశంలో సోషల్ వెల్ఫేర్ డీడీ శ్రీనివాసులు, ఐటీడీఏ పీఓ పరిమళ, డీఎంహెచ్ఓ పెంచలయ్య తదితరులు హాజరయ్యారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి : రూ.50
సన్నవి : రూ.35
పండ్లు : రూ.20

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	130
లేయర్ (లైవ్)	110
బ్రాయిలర్ చికెన్	236
బ్రాయిలర్ స్కిన్‌లెస్	262
లేయర్ చికెన్	187

ప్రకటన

నా క్లయింట్ అయిన **కోలగోట్ల శ్రీధర్‌రెడ్డి తండ్రి రాజగోపాల్‌రెడ్డి**, సరస్వతినగర్, నెల్లూరు నగరం అనువారు యిచ్చిన సంజాయిషీ మేరకు ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా:- నా క్లయింటు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని **శ్రీమతి మాగుంట సింధుర, శ్రీ మాగుంట విక్రమ్ మరియు మాగుంట సుశేష్** గార్ల వద్ద నుండి కొనుగోలు చేయుటకు నిర్ణయించుకొనినారు. సదరు వారలకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి, వారి తాతగారు అయిన **శ్రీ కాటా వెంకురెడ్డి తండ్రి వీరారెడ్డి వ్రాసిన రిజిష్టర్ వీలునామాలు తేది:15-06-2021 మరియు 31-08-2021 ద్వారా, సదరు వెంకురెడ్డి గారు తేది.26-02-2024**న కాలం చేసిన తరువాత, సదరు వీలునామాలు అమలులోనికి వచ్చినవి అనియు మరియు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి వారికి పూర్తి హక్కులతోటి సంక్రమించినవని మరియు రెవిన్యూ రికార్డులలో వారి పేర్లు నమోదు చేయించుకొని వారి స్వాధీనములో వున్నవని చెప్పుచున్నారు. మరియు క్రింది షెడ్యూలు దాఖల ఆస్తిపై ఎటువంటి పరాధీనములు, అడమానములు, అగ్రిమెంట్లు, అప్పులు, క్లయిమ్‌లు, లీజులు, కోర్టు వ్యవహారములు లేవని చెప్పుచున్నారు. కావున క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవ్వరికేని ఎటువంటి ఆక్షేపణలు వున్న ఈ పత్రికా ప్రకటన వెలువడిన తేది నుండి 5 రోజుల లోపల ఈ క్రింది అడ్రస్సుకు లిఖితపూర్వకముగా సరియగు ఆధారములతో తెలుపుకోవలసినది. తదుపరి వచ్చు ఆక్షేపణలు నా క్లయింట్‌పై బద్ధగించవు.

ఆస్తి షెడ్యూలు

SPSR Nellore District-Gudur Registration District- Muthukur Sub Registration- wet land situated in Sarvepalli Bit-V Village- Pottempadu Gram Panchayat- Muthukur Mandal bearing:- సర్వే నెం.268లో య.0-04 సెంట్లు, సర్వే నెం.284లో య.2-13 సెంట్లు, సర్వే నెం.287/1-ఎ1లో య.0-55 సెంట్లు, సర్వే నెం.287/1-ఎ2లో య.0-55 సెంట్లు, సర్వే నెం.287/1ఎ3లో య.0-54 సెంట్లు, సర్వే నెం.287/1-బిలో య.0-80 సెంట్లు, సర్వే నెం.287/1-సిలో య.0-79 సెంట్లు, సర్వే నెం.287/1-డిలో య.0.37 సెంట్లు, సర్వే నెం.287/1-ఇలో య.0-81 సెంట్లు, సర్వే నెం.287/1ఎఫ్‌లో య.0-65 సెంట్లు, సర్వే నెం.287/2-ఎలో య.0-14 సెంట్లు, సర్వే నెం.287/2-బిలో య.0-14 సెంట్లు, సర్వే నెం.287/2-సిలో య.0-14 సెంట్లు. వెరశి మొత్తం విస్తీర్ణం య.7-65 సెంట్లు భూమి.

Pallamreddy Viveka, B.Com., L.L.M.,
Advocate, D.No.26/3/b-72, Raja Street, Kanuparthipadu (Vi), Nellore City-524 003. Cell: 99085 45059